క్లుప్తంగా

పేరు మార్చండి సారూ..?



సమాచార బ్యానర్‌లో అలాగే ఉన్న గత అధికారి పేరు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో అధికారి పేరు మార్పు చేయాల్సి ఉంది. ట్రాన్స్‌కో నగర సబ్‌డివిజన్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బ్యానర్‌లో ఇంకా గత డీఈ శేషాద్రిరెడ్డి పేరు అలానే ఉంచారు. నాలుగు నెలల కిందట శేషాద్రిరెడ్డి రూరల్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో డీఈగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. గత అధికారి పేరు మార్పు చేయాల్సి ఉంది.

మూడు బైక్‌లు చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పలుచోట్ల మోటార్ సైకిళ్లు చోరీకి గురయ్యాయి. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయగా వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. కొంగారెడ్డిపల్లి, హైరోడ్డు, కట్టమంచి ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉంచిన బైక్‌లు కనిపించడం లేదంటూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు మోటార్ సైకిళ్లు చోరీ జరిగినట్టు కేసు నమోదు చేసిన పోలీసులు ఓ అనుమానితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

బ్యాంకుల రద్దీ



సప్తగిరి గ్రామీణ బ్యాంకులో బారులు తీరిన ఖాతాదారులు


తవణంపల్లె: బ్యాంకులకు ఐదు రోజుల పాటు సెలవులు రావడంతో లావాదేవీలు స్తంభించి పోయాయి. ఈ నెల 11వ తేదీ రెండవ శనివారం 12వ తేదీ ఆదివారం సెలవులు వచ్చాయి. మరోవైపు 13వ తేదీ సోమవారం నుంచి 15వ తేదీ బుధవారం వరకు సంక్రాంతి సెలవులు రావడంతో బ్యాంకులు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో 16వ తేదీ గురువారం బ్యాంకు సేవలు ప్రారంభమయ్యాయి. దీంతో బ్యాంకుల వద్ద జనం రద్దీ కనిపించింది.

స్మార్ట్ లైసెన్స్ సాధ్యమయ్యేనా ?

రాష్ట్రప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్‌ను స్మార్ట్‌కార్డు రూపంలో జారీ చేసేందుకు సిద్ధమైంది. అలాగే వాహన ఆర్‌సీలను స్మార్ట్‌కార్డుగా అందించేలా నిర్ణయం తీసుకుంది. కార్డుకు రూ.235ల చొప్పున వసూలు చేస్తోంది. నెల రోజులుగా ఈ స్మార్ట్‌కు చెల్లింపులు జరుగుతున్నాయి. అయితే ఇంతవరకు దీనిపై పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టలేదు. టెండర్లు పిలువక ఈ స్మార్ట్ జారీ ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వాహనదారులు అయోమయంలో పడ్డారు.

- డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీలకు స్మార్ట్‌కార్డులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయం
- కార్డుకు రూ.235 ఆన్‌లైన్‌లోనే వసూలు
- టెండర్లు పిలవకుండా కార్డులు ఎలా జారీ చేస్తారో ?
- అయోమయంలో వాహనదారులు





చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో నిరంతరం బిజీగా ఉండే శాఖల్లో రవాణా శాఖ కూడా ఒకటి. ఈ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది వస్తుంటారు. ఇందులో రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ)కి 120పైగా, డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్) 50 నుంచి 60 మంది వరకు వస్తుంటారు. కరోనా వ్యాప్తి కారణంగా స్మార్ట్ కార్డుల జారీకి బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత 65వేలకు పైగా ఉన్న పెండింగ్ కార్డులను ముద్రణ పూర్తి చేసి వారి ఇంటికి పోస్టల్ ద్వారా చేర్చింది. మారుతున్న కాలానికి అనుగుణంగా అరచేతిలోనే సేవలను పొందేలా చేసింది. దీనికి తోడు చాలామంది అన్ని రకాల డాక్యుమెంట్లను, పలు రకాల కార్డులను డీజీ లాకర్‌లో భద్రపరుస్తున్నారు. ఇలాంటి తరుణంలో అప్పటి ప్రభుత్వం స్మార్ట్‌గా ఆలోచించి స్మార్ట్‌కార్డు సేవలకు దూరమైంది. కార్డుకు అయ్యే వ్యయ భారం, ప్రదక్షిణలకు చెక్ పెట్టింది.

మళ్లీ తెరపైకి స్మార్ట్‌కార్డుల ప్రక్రియ

డీఎల్, ఆర్‌సీలకు మళ్లీ స్మార్ట్ కార్డులు అందజేయనున్న నేపథ్యంలో రవాణా శాఖ నిర్వహించే ఈ ప్రగతి, పరివాహన్ పోర్టల్లో నమోదుకు అవకాశం కల్పించారు. కార్డు ఫీజు రూ.200, పోస్టు ద్వారా పంపడానికి రూ.32, ఇతరత్రా కలిపి రూ.235 ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. అయితే టెండర్ల ప్రక్రియ వంటివి రూపుదిద్దుకోకుండా ఫీజు వసూలు చేయడంపై వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. టెండర్లు పిలవకుండా కార్డుల ముద్రణ ఎలా సాధ్యపడుతుందని వాహనదారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కార్డుల ముద్రణ విషయంలో ఎలాంటి స్పష్టత కూడా లేదనే విమర్శలు వస్తున్నాయి.

నిర్ణీత రుసుం చెల్లిస్తే చాలు..

స్మార్ట్‌కార్డులు కావాల్సిన వారు ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత రుసుం చెల్లిస్తే చాలు. కార్డుల పేరుతో అధికంగా వసూలు చేస్తే ఊరుకోం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ స్మార్ట్ కార్డుల జారీకి సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ జరుగుతోంది. త్వరలో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత కార్డుల జారీ ప్రారంభమవుతుంది. పోస్టల్ ద్వారా ఇంటికే వస్తుంది.

– నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు



వేమన పద్యాల పోటీ రేపు

పలమనేరు: వేమన జయంతి సందర్భంగా జాతీయ వేమన పద్యాల పోటీలను ఈనెల 18 నిర్వహించనున్నట్టు స్థానిక తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వందకు పైగా వేమన పద్యాలను చెప్పగలికే పిల్లలు ఇప్పటికే వాట్సాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరికి పోటీలను రేపు నిర్వహించి గెలుపొందిన పిల్లలకు అదే రోజు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు అందులో పేర్కొన్నారు.

కొనసాగుతున్న రైతు దీక్షలు



దీక్ష చేస్తున్న రైతులు

కుప్పంరూరల్: మండలంలోని ఆవులనత్తం వద్ద ఉన్న జెల్లీ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతుల నిరసన దీక్షలు 11వ రోజుకు చేరుకుంది. జెల్లీ ఫ్యాక్టరీ వల్ల తమ గృహాలు, పొలాలు, ఆరోగ్యాలు పాడవుతున్నాయని రైతులు 11 రోజులుగా నిరసన దీక్షలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందారు. జిల్లా అధికారులైనా మాపై దయ చూపాలని రైతులు కోరుతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. తుమ్మిందపాళ్యం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటి వద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని మైనగుండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇంటింటికీ వెళ్లి వైద్యం అందించేందుకే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్, మైనగుండ్లపల్లెలో ..

ఎ.గొల్లపల్లెలో ..

మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య బృందం 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ఐరన్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరం

ఐరాల: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. గురువారం మండలంలోని నెల్లిమందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 55 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. శీతాకాలంలో వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వైభవం.. గిరి ప్రదక్షిణ ఉత్సవం

మండపంలో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు, పుత్తూరు: కొండచుట్టు వద్ద కొలువైన విఘ్నేశ్వరుడు





- ఉదయం నుంచే జన సందోహం
- జోరుగా తినుబండారాలు, చెరకు గడలు, అలంకరణ వస్తువుల విక్రయాలు
- కొండచుట్టు మండపం వద్ద తిరునాళ్ల సందడి

నగరి: సంప్రదాయాలు, సంస్కృతికి అద్దంపట్టే పెద్ద పండుగను పురస్కరించుకుని ప్రతి ఏటా కనుమ పండుగకు మరునాడు ముక్కనుమ రోజున నిర్వహించే కొండచుట్టు ఉత్సవాలు ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించారు.. ఉత్సవాలకు కేంద్రమైన కొండచుట్టు మండపం వద్ద గురువారం వేకువజాము నుంచే తిరునాళ్ల సందడి నెలకొంది. మండపం పరిసరాల్లో తినుబండారాలు, బొమ్మలు, గాజులు, చెరకు గడలు, అలంకరణ వస్తువుల విక్రయాలు జోరుగా సాగాయి. రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో దుకాణాలు వెలిసాయి. సాయంత్రం 4 గంటల నుంచి ప్రజలు కొండచుట్టు మండపం వైపు నడక సాగించడంలో సుమారు కిలోమీటరు మేర జనసందోహం కనిపించింది. నగరి పట్టణం వదలి ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వారు కూడా సంప్రదాయంగా వచ్చే ఈ వేడుకను తిలకించడానికి కొండచుట్టు ఉత్సవాలకు హాజరయ్యారు. రాత్రి దీప కాంతుల్లో కొండచుట్టు మండపం శోభాయమానంగా వెలుగులీనింది. మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వినాయకుడి దర్శనార్థం జనం క్యూలలో బారులుతీరారు. ఆనవాయితీ ప్రకారం ఉత్సవాలకు విచ్చేసే దేవతామూర్తులకు నగరి కరకంఠేశ్వర స్వామి స్వాగతం పలుకగా ట్రాక్టర్లలో అందమైన ప్రభలతో అలంకారపూరితమై విచ్చేసిన దేవతామూర్తులు మండపం ఆవరణలోని మైదానంలో చేరారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ సాయినాథ్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ముగ్గురు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు 50 మంది భద్రతా చర్యల్లో పాల్గొన్నారు. మాజీ మంత్రి ఆర్కేరోజా పార్టీ శ్రేణులతో కలిసి హాజరై మండలంలోని వినాయకుని, ఊరేగింపుగా విచ్చేసిన దేవతలను దర్శించుకున్నారు.



మండపం ఆవరణలో కిక్కిరిసిన భక్తులు



పుత్తూరు కొండచుట్టు వద్ద భక్త సమూహం

పుత్తూరు మండలంలో..

పుత్తూరు: సంక్రాంతి పండుగలో భాగంగా 4వ రోజు గురువారం కొండచుట్టు వైభవంగా నిర్వహించారు. పెద్ద పండుగలో చివరిఘట్టమైన కొండచుట్టు ఉత్సవం మొత్తానికి తలమానికంగా నిలుస్తోంది. పుత్తూరులోని శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆహ్వానం మేరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి దేవతామూర్తులు మండపం వద్దకు అతిథులుగా విచ్చేయడం కొండచుట్టు ఉత్సవం ప్రాముఖ్యత. తొలుత శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వచ్చి ఆశీనులయ్యారు. అతిథులుగా శ్రీవిఘ్నేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి, సీతా సమేత శ్రీరామస్వామి, ఆంజనేయ స్వామి ఉన్నారు. వచ్చిన దేవతామూర్తులందరూ గ్రామంలోని విశేషాల గురించి మాట్లాడుకుంటారని ప్రతీతి. పలువురు దేవతామూర్తులందరూ ఒకేచోట కొలువుదీరడం చూసి తరించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. పట్టణం నుంచి మండపం వరకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అంగళ్లతో పట్టణం కళకళలాడింది.

అట్టహాసంగా వనవిహారం



వన విహారంలో ఆర్యవైశ్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఆర్యవైశ్య వనవిహార కమిటీ, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోట్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గురువారం నగరంలోని కట్టమంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పరుగు పందెం, లెమన్ అండ్ స్పూన్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, షటిల్, పాటలు, నృత్యం, రంగువల్లులు, లఘుచిత్ర, వ్యక్తృత్వ పోటీలు నిర్వహించారు. యువత, మహిళలు, పిల్లలు ఆసక్తిగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు చల్లూరు ద్వారకనాథ్, మట్టపల్లి శరవణ, ఆరూరు ప్రసాద్, ఎస్సీకే సత్యనారాయణ, పుష్పస్టోర్ చంద్ర, గోవర్ధన్, రవీంద్రబాబు, ఆరూరు రామ్మూర్తి, బైసానీ బాబురావు, బైసాని చంద్రశేఖరరావు, చిలంకూరు వెంకటేష్, సంపత్, రాఘవరావు, రామ్మూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గంగినేని పార్కులో సందడి చేస్తున్న పిల్లలు

గోట్ సందడి..

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కనుమ పండుగ తర్వాత నాడు గోట్ నిర్వహించుకోవడం ఆనవాయితీ. పిల్లలతో గంగినేని పార్కు సందడిగా మారింది.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



చెరువులో యంత్రాలతో తరలిస్తున్న మట్టి

కుప్పంరూరల్: కుప్పం పట్టణానికి సమీపంలోని లక్ష్మీపురం చెరువులో నిత్యం మట్టి తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు జేసీబీ, పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టుకుని మట్టిని తరలిస్తున్నా ఇటు రెవెన్యూ, అటు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గురువారం సైతం రెండు జేసీబీ యంత్రాలు, పదికి పైగా ట్రాక్టర్లతో పెద్ద ఎత్తున పట్టపగలే మట్టిని తరలిస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. లక్ష్మీపురం చెరువులో 30, 40 అడుగుల మేర గుంతలు ఏర్పడడంతో ఈ మారు నీరు నిలిచి ఉండే పరిస్థితి లేదని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో మట్టి తరలింపును అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోడెగిత్తల జోరు.. యువకుల హుషారు

మండలంలోని టేకుమంద గ్రామంలో గురువారం ముక్కనుమ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పందేలు హోరెత్తించాయి. యువకులు కేరింతలు నడుమ ఎడ్లపరుగు పందేలు దుమ్మురేపాయి. పరిసర ప్రాంతాల నుంచి ఎడ్లపందేలకు ఎద్దులను తీసుకొచ్చారు. పరుగులు పెడుతున్న ఎడ్లను నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. ఈ పోటీలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు గ్రామానికి వచ్చారు. మిద్దెలపై నుంచి ఎడ్ల పరుగు పందేలను తిలకించి ఆనందాన్ని పొందారు.

-బంగారుపాళెం



టేకుమందలో పరుగులు తీస్తున్న ఎద్దు



మిద్దెల పైనుంచి తిలకిస్తున్న ప్రజలు